
# అవిటివాడు



### చిలుకూరి దేవపుత్ర

సాయంత్రం నాలుగు గంటలవుతోంది...

ఎండాకాలం అవడం వల్ల సూర్యకిరణాలలో తీవ్రత వుంది.

మొహానికి విపరీతంగా చెమట పట్టినా తుడుచుకోకుండా నడుస్తూనే వున్నాడు కుమార్. అతని మనసంతా ఎంతో నిరుత్సాహంతో నిండి వుంది. అందుకే అడుగులు మందకొడిగా పడుతున్నాయి. నడుస్తోంది మెయిన్ రోడ్‌లోనైనా - సహారా ఎడారిలో నడుస్తున్నట్టు ఒంటరితనం పీడిస్తోందతన్ని.

జీవితంలో బాగా ఓడిపోయిన మనిషిలా వున్నాడు అతను. అయితే - అతని వయసు పట్టుమని పాతికేళ్ళు వుంటాయంతే.

ఎప్పుడూ తన పెదవులపై చిర్నవ్వునే పొదిగినా, అపుడపుడూ బాధ కలిగినపుడు వాటిని మునిపళ్ళతో పిండుకోవడం కూడా అలవాటయి పోయిందతనికి.

కుమార్ అలా నైరాశ్యంతో కొట్టు మిట్టాడడానికి కారణం అరగంట క్రితం తను ఉద్యోగం కోసం వెళ్ళిన ఇంటర్వ్యూయే!

కుమార్‌కి తెలుసు ఆ ఉద్యోగం తనకి రాదని... తనకి తెలుసు 'ఉద్యోగం' అన్నది 'సైసా'కీ, 'పలుకుబడి'కీ అమ్ముడు పోయేదని. మరైతే - తెలిసిదల్లా ఆ రెండూ తనకి లేవని తెలిసీ ఇంటర్వ్యూకి హాజరు కావడమే. అవును - అంత యాంత్రికంగా మారి పోయాడతను!

నిజానికి కుమార్‌కి ఉద్యోగం చాలా అవసరం తన ఇంటి పరిస్థితులలా వున్నాయి మరి. గంపెడంత సంసారాన్ని చిన్న గుమాస్తా గిరితో అతి కష్టం మీద నెట్టుకొస్తున్న నాన్నకి సాయపడాలి తను. తనని 'ఎమ్మెస్సీ' చదివించి అప్పుల ఊబిలో కూరుకు పోయిన తండ్రికి, ఎప్పుడెప్పుడు చేయి అందించి గట్టుకు లాగాలా అని మనసులో ఒకటే ఆత్రం కుమార్‌కి; ఓ వైపు ఇదిలా వుంటే - మరో వైపు తోటకూర కాడలా పెరిగి పెళ్ళికి ఎదిగి కూచున్న చెల్లెళ్ళా... ఏదో ఓ విధాన తను ఉద్యోగస్తుడు కాక పోతే ఇక వీలు లేదు. తనెంత ఆత్రపడుతున్నాడో అంత అందని మాని పండయి పోతోంది ఉద్యోగం.

మరో గంటలో తను గుత్తి వెళ్ళేందుకు బస్సుంది. అయినా కుమార్‌కి ఊరికెళ్ళాలని పించడం లేదు. మనస్సులో ఎక్కడో విరక్తిగా వుంది. ఇంటి కెళ్ళగానే తన ఇంటర్వ్యూని గురించి అమ్మా నాన్న, చెల్లెళ్ళూ సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. అందరికీ తను సమాధానాలు చెప్పే మూడ్‌లో లేడు కూడా. అందుకే ఆ వాల్టికి గోపీతో గడిపేద్దామనిపిస్తోంది కుమార్‌కి.

గోపీ - కుమార్‌కి చిన్ననాటి స్నేహితుడు. అతను ఆరో తరగతి పూర్తి కాకుండానే వాళ్ళ నాన్న అతన్ని ఈ ఊరికి తీసుకొచ్చి టైలరింగ్ నేర్చుకోడానికి వదిలాడు. ప్రస్తుతం అతనో చిన్నపాటి టైలరు. కుమార్ ఎప్పుడైనా అనంతపురం వస్తే అతన్ని కలవంది వెళ్ళడు.

ఓ పెద్ద బట్టల దుకాణం ముందు ఆగాడు కుమార్. గోపీ ఆ దుకాణం వరండాలోనే బట్టలు కుడుతూ ఉంటాడు.

"అరెరె కుమార్... రారా! అట్ల నిలబడి పోతివే" నవ్వుతూ పిల్చాడు గోపీ - బట్టలు కుడుతున్న వాడల్లా ఆపి.

మొహంలో నవ్వు పులుముకుంటూ వెళ్ళి గోపీ పక్కనే వున్న చెక్క పెట్టె మీద కూచున్నాడు.

"ఎప్పుడొచ్చినావురా! అంతా బాగుండారా" ఆప్యాయంగా అడిగాడు గోపి.

తను ఎప్పుడొచ్చిందీ, ఎందుకొచ్చిందీ చెప్పాడు కుమార్.

"అయితే ఇంకేం ఈ రాత్రికి ఇక్కడే వుండు - ఏదయినా సినిమా చూసొద్దాం... పొద్దన్నే ఊరికి పోదువు ఏం?" అన్నాడు గోపీ.

"సినిమాకేం వొద్దు గానీ... మనసంతా బేజారుగా వుంది... ఊరికి వెళ్ళాలనిపించ లేదు అందుకే ఇలా వచ్చినా".

"ముంతెడు నీళ్ళకే ఉలికి పడితే ఎట్లరా! బానెడు నీళ్ళు మీ బావ పోసుకుంటాడా?" అంటూ ఓరగా కుమార్ వేపు చూసి నవ్వుతూ "ఇట్లా దాన్లకంతా బేజారయి పోతే ఎట్లరా కుమార్! ఉద్యోగం వచ్చే కాలానికి తలతో నడుసుకుంటా వస్తాది. ఊరికే ఇదయి పోవాకు..." అంటూ ఊరడించాడు గోపీ.

గోపీకి కొద్ది దూరంలో కుడుతూ ఉన్న మరో టైలర్‌కి కుమార్ ఎంత చదివిందీ గర్వంగా చెబుతోంటే విషాదంగా నవ్వుకున్నాడు కుమార్.

"ఇంటికి పోదామా" అంటూ లేచాడు గోపీ. అతని వద్ద పని చేస్తున్న కుర్రాడికి చొక్కాలకి కాజాలు చేసి పెట్టమని పని పురమాయించి బయల్దేరాడు గోపీ. కుమార్ అతన్ని అనుసరించాడు.

గోపీని చూస్తే కుమార్‌కి ఎపుడూ జాలే... ఇంకా చెప్పాల్సి వస్తే గోపీ కుంటి కాలిమీదనే కుమార్ జాలంతాను. చిన్నప్పుడే పోలియో వచ్చి కుడికాలు అవిటిదయి పోయింది. అయినా ఒక్క కాలితోటే పగలంతా కుట్టు మిషను తొక్కగలడు. వాళ్ళ వూళ్ళో అందరూ అతన్ని 'కుంటి గోపీ' అనే పిలుస్తారు. చిన్నప్పుడు తనూ అలానే పిలిచేవాడు కుమార్.

ఊరి విశేషాలు చెప్పుకుంటూ నడుస్తున్నారు మిత్రులిద్దరూ.

"ఊళ్ళో వాళ్ళు ఏదో అంటారని నువ్వు నిరుత్సాహ పడొద్దురా కుమార్... నీకు ఈ ఉద్యోగం రాలేదంటే బ్రహ్మాండమైన ఏ లెక్చరర్ ఉద్యోగమో నీ కోసం కాచుకొని వుంటుందని నా నమ్మకం... ఇదీ నీ మేలు కోసరమేనేమోరా!" అన్నాడు గోపీ.

"నీ మొహంలేరా! చిన్న క్లర్కు జాబు వచ్చేకి గతి లేదు గానీ, ఇంక లెక్చరరంట... అట్లా ఆశలు ఏనాడో తుంచేసుకొన్నాను."

బాష్లెస్ టాకీ కంటే మూకీలే బావుంటాయి!
మితభాషి



యజమానురాలు:
నేను మితభాషిని. నెలతెత్తానంటె రమ్మని అర్థం

పనిమనిషి:
నేనుకూడానండి. తల ఊపానంటె రానని అర్థం



"ఏమో... ఎవురు జూసివారు... నువ్వు ఎమ్మెస్సీ సదువు తావని అనుకునింటిమా! అట్లనే ఇదీ... ఎవుడో ఒకడు నిజాయితీ కలిగిన ఆఫీసరు ఉండక పోడు, నీ తెలివి తేటల్ని జూసి టపీ మని ఉద్యోగం యియ్యకుపోడు... యేం బాద పడొద్దు. కలిసొచ్చే కాలమొస్తే నడిసొచ్చే కొడుకు పుడతాడురా!"

"ఆఫీసర్ల నీతీ నిజాయితీల మింద నాకు ఎప్పుడో నమ్మకం పోయిందిరా..." విరక్తిగా అన్నాడు కుమార్.

"ముందు ఓ కాఫీ తాగుదాం... ఈ హోటల్లో స్పెషల్ కాఫీ బాగుంటాది." అక్కడే ఉన్న ఓ హోటల్లోకి దూరారు మిత్రులిద్దరూ.

టిఫెనూ, కాఫీ దట్టించాక గానీ కుమార్ని వదల్లేదు గోపీ. బిల్లు చెల్లించి బయటికి వచ్చాక ఇద్దరూ సిగరెట్టు ముట్టించుకుని నడక సాగించారు.

రోడ్డు ప్రక్కన వున్న సందులోకి తిరిగారు.

కాఫీ తాగాక సిగరెట్టు తాగుతోంటే మనసుకు కొంత ఉపశమనంగా వుంది కుమార్కి. ఆ 'ఉప శమనం' వెనక గోపీ ఓదార్పు కూడా పని చెయ్యక పోలేదు.

"కుమార్!... కుమార్!!" అంటూ ఓ ఆడ గొంతు లోంచి కేక వినబడితే తిరిగి చూశారు ఇద్దరూ.

ఓ యింటి వరండాలో నిలబడి వున్న ఏభై ఏళ్ళ ఆవిడ నవ్వుతూ రమ్మని చెయ్యి ఊపుతోంది.

అప్రయత్నంగా "అరె! జానకమ్మత్త!" అన్నాడు కుమార్.

"మీ జానకమ్మత్తేరా! ఈ గేట్లోనే వాళ్ళుంటా వుండేది... నేను మాటల్లో బడి చెప్పడం మరిచినా" అన్నాడు గోపి.

ఇద్దరూ నవ్వుతూ జానకమ్మ వద్దకు వచ్చారు...

"ఏమప్పా కుమార్! ఇంటి ముందు నించి పోతా వుండి కూడా... ఏం గోపీ! నువ్వన్నా చెప్పేది లేదా... మేము ఈ యింట్లోకి మారినట్టు నీకి తెల్సుగదా... మాటల్లో బడి అదే పోనడమేనా?" అంది గోపీని నిష్ఠూరంగా.

"రండి రండి ఇంట్లోకన్నా అట్ల అడుగు పెట్టండి" ఆమె అన్నమాటల కన్నింటికి ఇద్దరూ చిరునవ్వే సమాధానంగా చెబుతున్నట్టు జానకమ్మ వెంటనడిచారు.

జానకమ్మ కుమార్కి దగ్గర బంధువేమీ కాదు కానీ, బీరకాయపీచు బంధుత్వం ద్వారా వరసకి అత్తవు తుంది. గుత్తిలో వున్నప్పుడు కుమార్ పక్క యింట్లోనే జానకమ్మ వాళ్ళు వుండడం వల్ల ఆమె దగ్గర బాగా చనువుండేది కుమార్కి. చిన్నప్పుడు ఆమె ఒళ్ళోనే పెరిగాడు కుమార్. జానకమ్మ భర్త చలమయ్య సప్తవ్యసనాలకీ బానిస కావడంతో గుత్తిలో వున్న ఇల్లూ, పొలం అమ్మేసుకొని ఈ ఊళ్ళోనే కిరాణా కొట్టు పెట్టుకున్నారు.

"అట్ల నిలబడి పోతిరేమప్పా! కూచ్చోండి!" అంటూ రెండు పెయింటు వేసిన ఇనప కుర్చీలు వాల్చింది జానకమ్మ.

"అత్తా! మురళీ, శ్రీధర్ ఏరీ? చాలా ఏళ్లయింది వాళ్ళిద్దర్నీ చూడక" అడిగాడు కుమార్.

జానకమ్మ సమాధానం చెప్పకనే గోపీ చెప్పడం మొదలు పెట్టాడు.

"నువ్వు గుర్తుపట్టలేవు లేరా! ఎంత మారి పోయి నారనుకుండావ్. నవిద్దర్నీ ఎడం చేత్తో కొట్టేస్తారు ఒక్కరొక్కరు. శ్రీధర్ చిన్నోడయినా మురళి కంటే కుడిగా వుంటాడులే... అద్దో ఆ ఫోటోల్లో చూడు నీకే తెలుస్తుంది" అంటూ గోడకి వేలాడుతా వున్న ఫోటోల్ని చూపించాడు గోపీ.

నిజంగానే వాళ్ళిద్దరూ గుర్తించనంతగా మారి పోయినట్టనిపించింది కుమార్కి.

"నువ్వు మాత్రం పోలిక ఏ మాత్రం మార లేదయ్యా... నిన్ను వెంటనే గుర్తించినా... ఏమంటే జొన్నకర్ర మాదిరి పొడుగు అయిపోయినావు" అంది జానకమ్మ నవ్వుతూ.

"ఇప్పుడేం చేస్తున్నారత్తా మురళీ, శ్రీధర్లు" అడిగాడు కుమార్.

"నీ మాదిరి చదువుకోలేదప్పా! వాళ్ళు.. పెద్దోడు మోటార్ మెకానిక్కు... రెండోవాడు సినిమాహాలు దగ్గర పాన్ బీడా షాపు పెట్టుకుండాడు.

> 'విద్య లేనివాడు వింత పశువు'
> అంటే, విద్య మనిషిని పశువుగాకుండా
> మానవుడిని చేస్తుందని అర్థం.
> అటువంటప్పుడు విద్యే మనిషిని
> అసహాయుడిగా, అశక్తుడిగా
> మార్చడం ఎంత విషాద కరం!

తన చదువుని గొప్ప చేయడం గర్వంగా అనిపించింది కుమార్కి...

కాఫీ చేయడానికేమో ఆమె ఇంట్లోకి వెళ్ళి పోయింది.

"మొత్తానికి అన్నదమ్ములిద్దరూ భలే కష్టపడతార్రా! వాళ్ళ నాన్న కూడా ఈ మధ్య తన వ్యసనాలన్నీ మానుకుండాడు... ఈ ఇల్లు సొంతంది తెలుసా? మొన్ననే లక్ష రూపాయలు పెట్టి కొన్నారు" అన్నాడు గోపి.

"ఏమిటీ లక్షా? అంత డబ్బెక్కడిదిరా? వీళ్ళకి" గొణుగుతున్నట్టు మెల్లగా అన్నాడు కుమార్.

"నెలకి కనీసం అయిదారు వేలు సంపాయిస్తారు ఇద్దరన్నదమ్ములూ... ఇంక వాళ్ళనాన్న ఒక మూడు వేలన్నా కిరాణా కొట్టులో సంపాయిస్తాడు... ఇంకేం కావల్ల... ఒక్క పైసా వేస్టుగా ఎవరూ ఖర్చు పెట్టరు... ఇంక ఇల్లు కొనేదేం పెద్ద సుద్ది?"

ఆశ్చర్యంలోంచి తేరుకోలేక పోతున్నాడు కుమార్.

కాఫీ తెచ్చి యిచ్చింది జానకమ్మ.

"ఇప్పుడేం చేస్తున్నావు కుమార్... ఏమన్నా ఉద్యోగమా?" అడిగింది జానకమ్మ.

"ఊహూ... ఇంకా లేదత్తా!" అన్నాడు కుమార్ సిగ్గుతో తలవంచుకుంటూ.

"ఏమిటీ... ఇంకా లేదా? మీ సంసారం జూస్తే ఎంత పెద్దదీ... నువ్వు జూస్తే పెద్ద పెద్ద చదువులు చదివి ఈ వయసులో కూడా ఉద్యోగం జెయ్యకుండా మీ నాయ మిందే ఆదరవుపడితే ఎట్ల?... ఇట్లాదప్పుడు మాత్రం నాకు మా పిల్లల్ని జూస్తే భలే హాయి అనిపిస్తాదప్పా!... ఏమంటే ఆ నా కొడుకులకి చదువు లొక్కటే అబ్బక పాయె... అది వాళ్ళకర్మ. ఎవురేం జేసే దుంది?... పిల్లోల్ని చదివించమని నేను నెత్తి నోరు మొత్తుగొనిజెప్తి ఇనలే మీ మామ..ఇద్దుర్నీ ఆ ఏడో తరగతి అయి పోతానే ఒగన్ని వర్కు షాపులోనూ ఇంకొకన్ని అంగట్లోనూ ఇడిసె..."

"అవునత్తా చదువుకోమంటే బాగుండేది" అన్నాడు కుమార్.

"ఆ... నా పిల్లలకి చదువురాకపోతే నేమప్పా! బాగనే సంపాయిస్తా ఉండారు. పెద్దోనికి యాభైవేలు డబ్బులూ, పది తులాల బంగార మిస్తావుండారు-కట్నంగా. చిన్నోనికి కూడా అంతే యిస్తారులే. నీకు ఎన్నదురావల్ల అంత కట్నం... ఉద్యోగం వస్తేనంటూ ఫరవాలే-లేకపోతే ఎవురొచ్చి ఇస్తారు పిల్లని... కట్నం మాట పక్కకి పెట్టు..." అంది నవ్వుతూ జానకమ్మ.

కొరడాతో చెళ్ళుమని కొట్టినట్టనిపించింది కుమార్కి. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ ట్టుంది కుమార్ పరిస్థితి.

గబగబ కాఫీ తాగేసి లేచి నిలుచున్నాడు కుమార్.

## ఈ వారం కథ

"ఏమప్పా! అప్పుడే? ఇంకా కాసేపటికి మురళి, శ్రీధర్ వాళ్ళు వస్తారు... ఈ రాత్రికి ఇక్కడే ఉండి పొద్దున్నే ఊరికి పోదువులే" అంది జానకమ్మ.

"చిన్న పనుంది అందుకోసమే ఇద్దరం వెళ్తున్నాం. ఈసారి ఎప్పుడైనా వచ్చి వాళ్ళని మాట్లాడిస్తాలే" అంటూ గబగబ చెప్పులేసుకుని బయల్దేరాడు కుమార్. పరిస్థితిని అర్థం చేసుకున్న గోపీ వెంట నడిచాడు.

చేసేదేమీ లేక గుమ్మంలోనే చూస్తూ నిలుచుండి పోయింది జానకమ్మ.

"జానకమ్మత్తంటే ఇంతకు మునుపటి జానకమ్మత్త కాదురా గోపీ! ఇప్పుడు దగ్గరకి పోతే ఉతికి ఆరేస్తుంది"

"మొత్తానికి నీ చదువునీ, నిన్నూ గడ్డిపోచ మాదిరిగ ఎంత తేలిగ్గా తీసేసిందిరా?" అన్నాడు గోపీ నవ్వుతూ.

వీధి దీపాలు అన్నీ ఒక్కసారిగా వెలిగాయి. అప్పుడప్పుడే చీకటి దట్టంగా ముసురుకొంటోంది.

ఇంటికెళ్ళాక-భోజనాలు చేసి ఆరు బయల్లో మంచాలు వేసుకుని పడుకున్నారు మిత్రులిద్దరూ. గోపీ భార్య కూతుర్ని పక్కలో వేసుకుని బయటి గదిలో పడుకుంది. బాగా పొద్దు పోయే దాకా పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. అలా మాట్లాడుతూనే నిద్దట్లోకి ఎప్పుడు జారిపోయాడో గోపి.

కుమార్‌కి నిద్ర రావడం లేదు. చంద్రుడు లేని ఆకాశంలో చుక్కలు మిణుకుమిణుకుమంటో వుంటే లెక్కపెడుతున్నట్టు ఒకదాని తర్వాత మరొకదాన్ని చూస్తోన్నాడు. కానీ అతని మనసులో చుక్కలు గురించిన ఆలోచన లేదు. తను 'ఎమ్మెస్సీ' చదివి ఏదైనా పొరపాటు చేశాడా? అసలు చదవక పోయి వుంటే మురళీ, శ్రీధర్‌లలా వేలకువేలు డబ్బుని సంపాయించే వాడేమో! గోపీ, మురళీ, శ్రీధర్ విళ్ళంతా తనకంటే మెరుగే తన జీవితం కంటే వాళ్ళ జీవితమే ఆనందంగా వుంది.

ఇంతలో... ఘొల్లున ఓ ఆడగొంతు బిగ్గరిగా ఏడుస్తోన్న శబ్దం!

దిగ్గున లేచి చూశాడు కుమార్.

అప్పటికే గోపీ కూడా లేచి చూస్తున్నాడు. అక్కడికి రెండిళ్ళ అవతల వున్న ఇంటిలోంచి వస్తోందా శబ్దం ఆయింట్లో ఒకటే దీపం వెలుగుతోంది.

ఏడుపుతోపాటు ఓ మగ కంఠం ఏదో తిడుతున్నట్టు అస్పష్టంగా వినిపిస్తోంది.

"ఏమైందిరా గోపీ ఆ యింట్లో?" అడిగాడు కుమార్.

"తెల్దు... పోయి చూసొస్తాం రా!"అంటూనే కదిలాడు గోపీ.

ఇద్దరూ ఆ యింటి వద్దకు వెళ్ళారు.

పక్క ఇళ్ళ వాళ్ళు ఒక్కరొక్కరే అటుగా వస్తోన్నారు.

"నీకేం పొయ్యేకాలం వచ్చిందిరా పనికి మాల్నోడా!" అంటూ అరుస్తున్నాడు ఒక బట్టతలాయన. అతనికి అరవై ఏళ్ళు వుండవచ్చు.

"ఏం జరిగిందీ?" అడిగాడు గోపీ.

"ఏముందప్పా! ఈ నా కొడుకు సచ్చే దానికి

## పనికిరాని పరిజ్ఞానం




### మతికుదిరిన గతి కుదురును

ఇంగ్లీషు రాజు చార్లెస్-రెండు సభలో ఓ కవి వుండేవాడు. ఈయన పేరు సెడ్లీ *(1639-1701)*. తనని దేవదూతగా వూహించుకుంటూ వుండేవాడు. బాగా వ్యభిచరించేవాడు. ఒకమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడుగానీ, ఆమెకు పిచ్చి పట్టడానికి ఎక్కువకాలం పట్టలేదు. ఈయన చాలా అసభ్యంగా ప్రవర్తించేవాడుట. ఓసారి ఆయన మరికొంత మందితో బాగా తాగేసి భవనం బాల్కనీలోకొచ్చి రోడ్డు మీద పోతున్న జనానికి కాముక భంగిమలతో అల్లరి పెట్టాడుట. తాగుడికి బాగా ఒళ్ళు వేడెక్కిన తదనంతరం పూర్తిగా బట్టలు విప్పేసి జనాన్ని బూతు పదజాలంతో వుడికించాడట. దానికి అతను 500 పౌండ్లు అపరాధ సుంకం కట్టుకోవాల్సి వచ్చింది. మరోకసారి బాగా తాగేసి నగ్నంగా రాత్రంతా వీధుల వెంబడి తిరుగుతూనే వున్నాడుట. ఇంకో సారయితే ఓ మతకన్యని ఎగరేసుకు పోయాడట. నీ మతాధికారికన్నా నేనే మొనగాడ్ని అని నిరూపించటం కోసమే ఇట్లా చేసాను అన్నాడుట. 1680లో ఓ టెన్నిస్ కోర్టులో వుండగా పెద్ద దెబ్బ తగిలిందట-బుర్రకి అయివుండాలి. అప్పట్నుంచి అతను పూర్తిగా మారిపోయాడట. చివరి రోజుల్లో ఆయన పూర్తిగా దైవభక్తి పరాయణుడిగా అయిపోయాడుట. అప్పట్లో వ్యభిచార నిర్మూలనకి, దైవ దూషణ నిరోధానికి ప్రవేశ పెట్టబడిన బిల్లులను ఈయనే తయారు చేశాడుట!

— రిలేకరి

పూనుకుండాడు-అద్దో-అక్కడ చూడు దూలానికి పగ్గం కట్టినాడు. సాయంకాలం మంచి ఈణ్ణి ఒక కంట గమనిస్తానే ఉండా- కాబట్టి సరిపోయింది లేకుంటే ఈ పాటికి సచ్చి పోయిండేవాడు" అన్నాడు ముసిలోడు బొంగురు పోతున్న కంఠంతో.

ఏడుపు విన వస్తోన్న గదిలోకి తొంగి చూశాడు గోపీ, కుమార్లు. చిన్నగదిలో ఓ మూలగా ట్రంకు పెట్టె మీద నిర్లిప్తంగా ఎటో చూస్తూ కూచుని ఉన్నాడు ఓ యువకుడు. అతని పక్కనే ఓ ముసలామె నెత్తికి చేతులు పెట్టుకొని జరగరానిది అప్పుడే జరిగి పోయినట్టు ఏడుపు స్థాయి తగ్గకుండా అలాగే ఏడుస్తోంది.

ఆ యువకుడ్ని గుర్తించాడు కుమార్-ఉదయం ఇంటర్వ్యూకి అతనూ వచ్చాడు " ఈ ఇంటర్వ్యూకే నాకు లాస్ట్ ఛాన్సండీ-త్వరలో నాకు ఏజ్‌బార్ అయి పోతుంది" అంటూ అతను ఎవరితోనో అన్న మాటలు కూడా జ్ఞప్తికి వచ్చాయి.

"చూడండప్పా! ఈ నా కొడుకు చచ్చి ఏం సాధించాలనుకుండాడో-ఈ చీటీ రాసిపెట్టి చావుకు రెడీ అయినాడు" అంటూ గోపీ చేతిలో ఓ కాగితం వుంచాడు ఆ ముసలాడు.

కుమార్ దాన్ని లాక్కుని గబగబ చదవ సాగాడు.

"ఈ రోజుతో నాకు భవిష్యత్తు లేదన్నది తెలిసి పోయింది. ఎన్నో కష్టాలు పడి నన్ను 'ఎమ్మే' చదివించినా నా తల్లితండ్రులకి ఏవిధంగానూ సాయపడలేక పోయినాను. నా చదువు కష్టపడి సంపాదించడం నేర్పలేదు. హుందాగా అందంగా బ్రతకాలని నేర్పకనే నేర్పింది. అందుకే నేను రిక్షా లాగలేమా, కారు తోలలేమా, కట్టెలు కొట్టలేమా, మసిపూసుకొని మెకానిక్కునీ కాలేను. ఎక్కడయినా ఉద్యోగం రాక పోతుందా అని ఆశతో వెతికాను ఇన్నాళ్ళు. వాది ఆశ కాదు దురాశ అన్నది తేలి పోయింది. శారీరకంగా వచ్చిన అవిటితనం మనిషిని మాత్రమే బాధిస్తుంది. అయితే ఈ చదువుల వల్ల వచ్చిన నా అవిటితనం నన్నూ నా వాళ్ళనీ, బాధిస్తోంది. అందుకే ఈ ఆత్మహత్య... ప్రభాకర్"

"మీరయినా చెప్పండయ్యా వానికి బుద్ధి!" అంటూ వణుకుతోన్న కంఠంతో చెబుతోన్నాడు ఆ ముసలాయన.

కుమార్ కదల్లేదు-తనూ ఓ 'అవిటి వాడే'గా ఏమని చెబుతాడు అతనికి? ●